# మాంసం మార్కెట్టు

లబ్బి సాయిబుది డాగులు పడ్డ కాకి నిక్కరువంటి ముఖం. పెదాలు పగిలిన ఉల్లిపాయల్లాంటివి. కళ్లు రక్తం చిమ్మించి కోస్తే తెగిన గొఱ్ఱె మెడవంటివి.

ప్రతి ఉదయం నిద్రలేవని సూర్యుణ్ణి నిద్రలేపటానికి ఎత్తే హారతు, మాంసం మార్కెట్టులో వ్రేలాడదీసే గొఱ్ఱె తొడలు.

మద్దు గత్తితో తొడకోసి, మాంసం తూచి, అమ్మి, డబ్బు తీసుకోవటం, యమధర్మరాజు వాడే ధర్మతులతో న్యాయ విచారణ చేస్తున్నట్లుంటుంది.

తేలిక డబ్బు—కాగితాల డబ్బు—గట్టి మాంస, రక్త మాంసాలున్న మాంసం కొంటుంటే వింతే!

పదేళ్లనుంచి చెమటోడ్చి మాంసం వ్యాపారంలో డబ్బు బాగా గణించాడు లబ్బి సాయిబు.

అతను, చదరంగంవంటి లుంగీ కట్టుకొని, కాఫీలో తడిసి నట్లున్న బన్నీను వేసుకొని ఇనుపకొక్కిల మాంసం కోసి అమ్ముతుంటే పూర్వ జన్మలో—ఉంటే గింటే చిత్రగుప్తుడి దగ్గర లోకంలో పట్టుబడని నేరస్థుల్ని నరకంలో నరకయాతన పెట్టిన యమకింకరుడై పనిచేసి వుంటాడనిపిస్తుంది.

గల్లాలో పెరిగే డబ్బుకీ, కొక్కీలతో తరిగే మాంసానికి ఉన్న సత్సంబంధంపట్ల ప్రగాఢ విశ్వాసం ప్రదర్శించే నీతి మంతుడు లబ్బి సాయిబు.

ముక్కు కొనమీద జారే చెమటబొట్టు ఎడంచేత్తో తుడుచుకుంటూ కుడిచేతితో మద్దుగత్తి పండితుడి కలంలాగా పరపరలాడించే లబ్బి సాయిబు తీరు చూడవలసిందే!

ఎడంచేత్తో ఎగదోస్తూ, కుడిచేత్తో కత్తి కదుపుతూ మాంసం ఖైమా చేయటం—ధారాళంగా ఉపన్యసించే రాజకీయ వేత్తనీ, తీవ్రంగా వాదించే అడ్వకేట్‌నీ, కసిగా పాఠం చెప్పే లెక్చరర్‌నీ, గుర్తుకు తెస్తుంది.

ఏ రోజు ఉదయం చూచినా ఎనిమిదోనంబరు గది మొగదల మాంసం ముక్కలు ఎడావెడా తిరుగుతూ చెడామడా అమ్ముతూ వుండే లబ్బిసాయిబు కొద్ది రోజుల్నుంచి కనిపించటం లేదు.

తెగబలిసి కుమ్ములాటకూ దొమ్మీకీ సిద్ధమయ్యే పొట్టేలు కొమ్ముల్లాగా మెలికలు తిరిగిన జుత్తు ఎగేసినా నిక్కబొడుచు కుంటూవున్నా బసప్ప కళ్లల్లో పశుత్వం వెనుక అమాయి కత్వం లేకపోలేదు.

ఆరు నెలల క్రితం అరణ్యం వదిలి, అరణ్యం కంటే అధ్వాన్నంగా వున్న జయిల్‌లో ప్రవేశించిం తర్వాత కూడా బసప్ప కళ్లల్లో నీళ్లు కరువయ్యాయి.

గుంటూరు బావుల్లో నీళ్లున్నట్లు అతని కళ్లు ముచ్చికల గుంటను ఆనుకొని వున్నాయి, ఆకలిగా కోపంగా, చీదరగా.

జయిల్ కటకటాలు సినీమాలలోని రాక్షసుడి పళ్లులాగా వున్నా, గది చీకటి నిగ్గు తేల్చు కొంటుండే కొండ గుహలా

గున్నా, చాప కుష్ఠురోగి శరీరంలాగున్నా, నేల సినీమా హాలులో నేల టిక్కెట్టు వాళ్ల లావెత్రీలాగున్నా, బ్రతికి ఉండటం తప్పనిసరి అయింది బసప్పకు.

నిద్ర పడుతుంటే దోమల రొద పల్లకీల మోతలాగా విసుగూ విరామం లేకుండా గోల, నిద్రపోతుంటే సడీచప్పుడూ లేకుండా, తేలుకుట్టిన దొంగలాగా వచ్చి కుట్టిపోక, పొట్ట పగిలేటట్టు నెత్తురు తాగే నల్లుల నేర్పు సునాయాసంగా రెండు నెలల్లో బసప్పను తమ వాణ్ణి చేసుకొన్నాయి.

కసాయివాడు గొఱ్ఱెలనల్ల ఖరీదుకు అమ్ముకొంటాడు. పైసా ఖర్చులేకుండా, రుచిగల బసప్పవల్ల, మెలికలు తిరిగిన కండరాల లోపల గోర్వెచ్చగా తిరుగాడేనల్ల క్రొవ్విన శరీరం లోంచి కాటువేస్తే చివ్వున వెలుపలికి వచ్చేనల్ల, తనివి తీరా తాగి, సంతానాభివృద్ధి చేసుకొన్న దోమలకూ, నల్లులకూ భారతదేశంలో పెరిగిన జనాభావంటి వాటికి చిక్కిపోయిన బసప్ప ఒళ్లు—క్షామం తగిలి పంటలు పండని నేలలాగా ఎండి నెరళ్లుపడి బీడయిపోతే—కంట్రోలు వచ్చినట్లు అయి తిండిలేక పోతే 'మాకు తిండిపెట్టండి, మమ్మల్ని ఈ లోకంలోకి సరఫరా చేయమని ఎవరేడ్చి మొత్తుకొన్నారు' అంటూ గోలపెట్టి, స్ట్రైక్ చేసి, యాజిటేషన్ చేసి, నిరాహార దీక్ష పూనాయి, నల్లుల పిల్లలూ దోమల పిల్లలూ ఏక ఉమ్మడిగా ఏక టాకీగా.

లబ్బి సాయిబు చిన్నతనంలో నెత్తురు చూస్తే, దెబ్బ దగిలి రక్తం వచ్చినా, దోమో, నల్లో కుట్టితే చంపితే నెత్తురు కనిపించినా, కళ్లు బైర్లుకమ్మి, స్పృహ తప్పి పడిపోయేవాడు.

పెరిగి పెద్దయింతర్వాత, నెత్తురు కళ్ల జూడందీ, నిద్ర పోయేవాడు కాదు. నిద్ర పట్టేది కాదు.

చిన్నతనంలోనే పందిపిల్లను కుక్కలు పట్టి చంపి, రక్తం మడుగులో దాన్ని తింటూ కరుచుకోవటం చూచింతర్వాతా; ఊరి కుక్కల్ని మునిసిపాలిటి వాళ్లు పట్టుకుపోయి, ఊరి వెలుపలికొచ్చి చంపటం పరికించింతర్వాతా; బ్రాతల్ హావుస్ నడుపుతున్న తన తండ్రిని నడివీధిలో నలుగురు రౌడీలు చిత్రహింస పెట్టి చంపి రక్తం మడుగులో పడేసినా, సాక్ష్యం లేక హంతకులు చనిపోక పోయింతర్వాతా; ఇంటిలో చొరబడి, బ్రాతల్ ఆడవాళ్లతోపాటు అమ్మనూ పట్టుకుపోయిన రౌడీలు కానీ, అమ్మ కానీ కనిపించక పోయింతర్వాతా; ఆదుకొనే అన్నగానీ అక్కగానీ, మరే బంధువులూ లేకపోయింతర్వాతా; మాంసం మార్కెట్టు నాగులు చేరదీసి తిండిపెట్టి, వృత్తి నేర్పింతర్వాతా; నిరభ్యంతరంగా, నిశ్చితంగా కడుపు నింపుకోవటం కోసం, తిండికోసం, భార్యాపిల్లల్ని బ్రతికించుకోవటం కోసం, మాంసం లేకపోతే ముద్దకూడా గొంతుదిగని మనుష్యులకోసం, మాంసం మార్కెట్టు లబ్బి సాయిబు అయింతర్వాతా; ఎన్ని గొర్రెల మెడలో కోశాడు. ఎంత మందికో మాంసం అమ్మాడు, డబ్బు బాగా సంపాయించాడు.

లబ్బి సాయిబు అంత నిజాయితీ పరుడు నిజం మాట్లాడితే రాజకీయాలలో రాణించేవాడు. మాంసం తూయటంలో దేవుడయినా తప్పు తూస్తాడేమో కాని, అతనుమాత్రం మోసంచేయడు. తూకం ధర అందరూ పెంచినా అతను పెంచ

లేదు. దమ్మిడీ రావలసివున్నా, ఇవ్వవలసివున్నా, నికచ్చిగా ఇవ్వాలి, నిఖార్సుగా తీసుకోవాలి.

అతన్ని చూస్తే భయం కలగవచ్చు. పసిపిల్లలు కెవ్వున కేక వేయవచ్చు కాని పరిచయం ఉన్నవాళ్లకు అతని అంత ధర్మపరుడు, దానగుణం ఉన్నవాడు, లైటు వేసుకొని వెతికినా కనిపించరు. కొద్ది రోజుల్నుంచి లబ్బి సాయిబు కనిపించటం లేదు.

* * * *

బకచికి ఎండు డొక్కతో, ఎండి ఆకులు రాలి, కొమ్మలు విరిగిపోతున్న వటవృక్షంలాంటి విశాలమైన మనిషి బసప్ప కనబడుతూనే వున్నాడు. జైలు నాలుగు గోడల మధ్య, లంకలో అశోక వృక్షం క్రింద ఒంటరిగా కూర్చున్న సీతమ్మలాగా.

'అదేందో అదట్టా అయిపోయింది ఇదిట్టా ఏడిసింది' అను కొంటాడు ఎప్పుడైనా గతం కళ్లముందు మెదిలితే.

పుట్టి భూమ్మీద పడ్డాక పుడక అయినా ఇంట్లో లేని బసప్ప కుటుంబంలో బంగాళాఖాతంలో డిప్రెషన్ పుట్టి తుఫాను చెలరేగినట్టు విపరీతంగా వర్షంలాగా సంపద కురిసింది.

ఆ ఏడు ఏడలేని వానలు కురిశాయి వాగులు వంకలు సాగాయి. భూమిగుండె మెత్తబడి, మగాడి ఎదురొమ్ముమీద వెంట్రుకలు లాగా దట్టంగా గడ్డి మొలసింది. అందు గడ్డి పరక ముఖం ఎరక్క, కొండలు బండరాళ్లలో మిగిలిపోయి, ఉన్న మందవూపిరి మూడి చావటమో, అయినకాడికో, కాని కాడికో అమ్మటమో జరిగి, నామ మాత్రంగా గొర్రెలు మిగిలాయి.

ఆ ఏడాది కా ఏడాదికి గొత్తెలమంద పెరిగిపోయింది బసప్ప వయస్సులాగా. ఆ మధ్య ఎప్పుడూ తూమంరాలేదు. పిల్లాడి పుణ్యాం తలుచుకొని, మంద పెంచుకొన్న తల్లిదండ్రులు భూమిమీద నూకలు లేక స్వర్గానికి వెళ్లిపోయారు.

చిన్న తనంలోనే మంద బాధ్యత నెత్తిబడి, కాకులు దూరని కారడవులు, చీమలు దూరని చిట్టడవులు దూరి, మందను మళ్లేసుకొంటూ, ఆకులో అలములో తింటూ, చనిపోయిన గొత్తెల్ని కాల్చుకుతింటూ, ఊళ్లో ఇల్లున్నా అడవిలో కొండల్లో బ్రతుకుతూ వంటినిండా కోర్కెలు పుట్టిందాకా, వయస్సు ఎలనాగకోసం తెలనాగులాగా ఎరిగి పడుతున్న దాకా, కొండల్లో రాయిగా, గొత్తెల్లో పొట్టేలులాగా, పశువుల్లో అమాయికపు పశులాగా జీవించాడు.

కొట్టుకొన్న కట్టెలు మోపు కట్టుకొని; కొండ దిగి లోయలోకి వస్తున్న సూరిని చూచింతర్వాత గుండెలో పొట్టేలు గిట్టల చప్పుడు, మనస్సులో వేటకుక్క మొరుగు వినిపించిది.

చెట్టు కొమ్మల్నీ, చిన్ని మొక్కల్నీ, తెగనరికి మందకు పడేసే బసప్ప, గండ్రగొడ్డలి భుజాన పెట్టుకొని, ఏటవాలుగా కాలిబాట వెంట, లోయలోంచి కొండెకాకాడు.

సూరిని విచిత్రంగా చూస్తే, సూరి సూతారంగా నవ్వి, తెక్కా జమూ లేకుండా వెళిపోవటం చూస్తే, చిర్రెత్తుకొచ్చి, 'ఏంది నీ కత' అని పలకరిస్తే 'నీ కతేంది' అని జవాబిస్తే, 'నా కథ చానావుందంటే' నీ కథ ఏముంది ఎర్రని యాగాణీ లేదంటే 'మందమ్మితెత్తా' నంటే 'తీసుకురా చుక్కేసుకొని నీతోవుంటా' వెళ్లిపోయింది సూరి.

* * * *

లబ్బి సాయిబు శుక్రవారం సంతలో అమ్మే గొఱ్ఱెల్ని కొని, కోసి మాంసం అమ్ముతుంటే లాభం తక్కువగా వుంది చవగ్గా అమ్మాలి, సరసంగా అమ్మాలి, లాభం ఎక్కువ రావాలి అంటే కష్టంగానే ఉంది.

మందలోంచి ఒక్కసారి వందో ఎంతో గొఱ్ఱెల్ని కొంటే రెండు వారాల పాటు చింత వుండదు. డబ్బు తోలుపట్టాతో పెట్టి నడుం చుట్టూకట్టుకొని, ఎక్కడ గొఱ్ఱెలు అగ్గవగా దొరుకుతాయో కనుక్కొని బయలు దేరాడు.

సూర్యుడు నెత్తిమీద ఎర్రటి దుమ్ము పోసుకొంటున్న వేళ, బళ్లగానులు చొచ్చుకుపోయి రేగివున్న డొంకలోంచి బయలు దేరాడు లబ్బి సాయిబు.

పొద్దున్నే వచ్చి కటకటాల తలుపు తాళాలు పోలీసులు తీస్తుంటే, లెక్కాపత్రం లేకుండా కూర్చున్నాడు బసప్ప.

చేతులకు గాజులు తొడిగినట్లు బేడీలు వేస్తుంటే విసుక్కున్నాడు. లాక్కుపోతుంటే, తను పొట్టేలును లాక్కు పోవటం గుర్తు వచ్చింది.

నల్లటి బట్టల్లో న్యాయాధిపతులు ప్రప్రథమంగా తిండి కోసం, తర్వాత న్యాయంకోసం ఉద్యోగాలు చేస్తున్నారు.

తిర్నాల చూట్టానికి ఎగడ్డ జనంలాగా పోగయ్యారు మనుష్యుల మంద. ఇసుకేస్తే రాలవచ్చుగానీ, మనిషిని వేస్తే రాలనంత చిక్కగా క్రిక్కిరిసిపోయింది కోర్టు హాలు!

ఏ మయిందో ఏమో సాయం కాలానికి ఎటువాళ్లు అటు వెళ్లిపోయారు. 'పాపం!' అంటూ, 'పాపం ఏ ముంది లే' అంటూ.

విచారణ పూర్తి అయి, శిక్ష వేసి, ఆ రాత్రి అదే జయిల్ గదిలో పోట్లగిత్తను, బక్క-చిక్కిన పోట్లగిత్తను కట్టివేసినట్లు, బసప్పను బంధించారు.

లబ్బి సాయిబు బస్సు దిగి వూళ్లోకి పోయి చింతచెట్టు క్రింద కూర్చుంటే, కొండల్లో వున్న బసప్పను పిలుచుకు వచ్చింది సూరి.

* * * *

బేరం సారం చింతచెట్టు క్రిందే ముగిసింది. మందలోంచి నచ్చిన వంద ఏరుకోమని బసప్ప చెప్పిందే తడవుగా బయలు దేరాడు లబ్బి సాయిబు.

'డబ్బుందా?'

'ఉంది!'

'డబ్బుకు పట్టణం రమ్మంటే రాను!'

'రానక్కర్లే! దగ్గరే వుంది?'

'ఏది?'

'నడుంకు చుట్టు కొన్నానులే!'

ముందు లబ్బి సాయిబు వెనుక బసప్ప పోతున్నారు కొండల్లోకి.

'మంద తోలుకుపోయి ఏం చేస్తావు?' అడిగాడు బసప్ప.

'ఏముంది మార్కెట్టుకే! మాంసం మార్కెట్టుకే లాభాలు రావటం లేదు'.

బసప్పకు అర్థమయిపోయింది. గొర్రెల్ని మాంసంకోసం ఎవడో చంపటం ఇష్టంలేదు. గొర్రెల్ని అమ్మకపోతే డబ్బు రాదు. డబ్బు లేకపోతే సూరి లేదు.

బసప్పకూ ఆలోచన ప్రారంభమయింది.

మంద దగ్గరకు వచ్చారు. అంతా వేయి పైచిలుకే వుంటుంది మంద. కొండలతో కొండరాళ్లు వెనుక ఎక్కడ చూచినా గొర్రెలే!

బాగా కొవ్విన గొర్రె పొట్టేళ్లను ఏరుకొని గుర్తుకోసం కొంచెం జుత్తుకత్తిరిస్తున్నాడు లబ్బి సాయిబు.

బసప్ప కొమ్మలు విరకొట్టి గొర్రెలముందు పోగు పోస్తున్నాడు బసప్ప గండ్ర గొడ్డలి భుజంమీద పెట్టుకొని.

మంచినీళ్లు తాగటంకోసం తోడేలులాగా వంగి దోసిళ్లలో, కుంటలో నీళ్లు తాగుతున్న లబ్బి సాయిబుని, భుజంమీద గండ్రగొడ్డలి ఎత్తి చాచి ఒక్కటేశాడు బసప్ప.

తల పగిలింది. తెగిన మెడలోంచి రక్త వచ్చింది. నాలుక బైటికి వచ్చి పళ్లు మధ్య గట్టిగా చిక్కపోయింది. దోసిల్లో నీళ్లు అలాగే వున్నాయి. లబ్బి సాయిబు ఆలాగే కూర్చు న్నాడు. ప్రాణం మాత్రం లేదు.

లబ్బి సాయబు బొడ్లో డబ్బు బద్రంగా తీసుకొన్నాడు. రెండు నెలలు ఇష్టారాజ్యంగా కొండల్లో తిరిగారు.
చివరికి పోలీసులు బసప్పను పట్టుకొన్నారు. జయిల్లో పెట్టారు. శిక్ష విధించారు. తీర్పు.

'ప్రాణం పోయిందాకా ఉరితీయాలి' న్యాయాధికారులు భాష విషయంలో భద్రంగా వుంటారు.

తీర్పు నెరవేరింది.

జయిల్లోనే నిర్ణీత సమయంలో బసప్పను ఉరితీశారు.

గవర్నమెంటు డాక్టర్, చినిపోయినట్టు సర్టిఫికేట్టు ఇచ్చాడు.

బ్రతుకు తెరువుకోసం లబ్బిసాయిబు వ్యాపార దృష్టితో గొర్రెల్ని చంపాడు.

బ్రతుకు తెరువుకోసం బసప్ప జీవితా కాంక్ష దృష్టితో లబ్బిసాయిబును చంపాడు.

బ్రతుకు తెరువుకోసం, ఉద్యోగంలో చేరిన న్యాయాధిపతి న్యాయదృష్టితో బసప్పను ఉరి తీయించాడు.

పశువు లెక్కవయి పోయిన ఈ లోకం ఒక మాంసం మార్కెట్టు.